సాక్షి తిరుపతి

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



ఏ ఒక్కర్నీ వదలం

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన రేణిగుంట సబ్‌రిస్ట్రార్ కార్యాలయంలో ముమ్మర సోదాలు కొనసాగుతున్నాయి. - 8లో



అమ్మవారికి సారె సమర్పణ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. - 8లో



గంజాయి స్వాధీనం

నారాయణవనం మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు పుత్తూరు రూరల్ సీఐ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 48 ఫిర్యాదులు



ఎస్పీ సుబ్బారాయుడుకు ఫిర్యాదులు అందజేస్తున్న బాధితులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి ఫిర్యాదులు వెలువెత్తినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 48 ఫిర్యాదులు అందినట్టు వెల్లడించారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఇతర ఫిర్యాదులు అందినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 67,496 మంది స్వామివారిని దర్శించుకోగా 19,064 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.





గజ వాహనంపై అమ్మవారు (ఇన్‌సెట్) లక్ష్మీకాసుల హారాన్ని ధరించిన శ్రీపద్మావతి అమ్మవారు

శుభకరి!

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీమహాలక్ష్మి అలంకరణలో గజ వాహనంపై ఊరేగుతూ అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. ఉదయం జగన్మోహిణి అలంకరణలో పల్లకీలో ఊరేగుతూ దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం అమ్మవారికి వేడుకగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సర్వభూపాల వాహనం, రాత్రి గరుడ వాహన సేవలు జరగనున్నాయి. పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, ఈఓ శ్యామలరావు, జేఈఓ వీరబ్ర హ్మం, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ పాల్గొన్నారు.

నేడు స్వర్ణరథోత్సవం

కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు.

శోభాయాత్ర

తిరుమల/చంద్రగిరి : పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసుల హారం శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. 15 ఏళ్లకు పైగా గజవాహన సేవలో ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ఆధ్వర్యంలో హారాన్ని తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకొచ్చారు. అక్కడ టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు ఆధ్వర్యంలో తిరువీధుల్లో శోభాయాత్రగా ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజవాహన సేవలో లక్ష్మీకాసుల హారాన్ని ధరించి అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. అలాగే మంగళవారం నిర్వహించే గరుడ వాహన సేవలోనూ హారాన్ని ధరించనున్నట్టు టీటీడీ చైర్మన్ తెలిపారు. అంతకుముందు లక్ష్మీకాసుల హారాన్ని తిరుమల శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ అడిషనల్ ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో తిరుచానూరుకు తీసుకొచ్చారు.



కాసుల హారాన్ని మోసుకొస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం



పల్లకీపై ఊరేగుతున్న శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారు



తిరుమల: లక్ష్మీకాసుల హారాన్ని మోసుకొస్తున్న అడిషనల్ ఈఓ

అన్నదాత కష్టం నీటిపాలైంది. ఫెంగల్ తుపాను తీరని నష్టాన్ని మిగిల్చింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్ష ఎకరాల్లో వరినాట్లు వేయగా.. అందులో సగానికిపైగా పంట దెబ్బతింది. మిగిలిన పంట నాలుగైదు రోజులుగా నీటిలోనే నానుతుండడంతో పాచిపోయి.. పనికిరాకుండా పోతోంది. వడ్డీలకు తెచ్చి పెట్టిన పెట్టుబడులు కొట్టుకుపోయాయని రైతాంగం కన్నీటిపర్యంతమవుతోంది. పంట నష్టాన్ని అంచనా వేసే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.



చిట్టమూరు మండలంలో నీటమునిగిన వరినాట్లు

కష్టం మునక!

ముంచేసిన ఫెంగల్

- వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- కొన్నిచోట్ల వరద ఉధృతికి కొట్టుకుపోయిన వరినాట్లు
- నాలుగు రోజులుగా నీటిలోనే నానుతున్న వైనం
- ఆందోళనలో అన్నదాతలు
- నష్టం అంచనాలో అధికారులు



సూళ్లూరుపేట : పడమటకండ్రిగలో పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్

నీట మునిగిన పంటల పరిశీలన

సూళ్లూరుపేట : మండలంలో నీటమునిగిన పంట పొలాలను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పరిశీలించారు. సూళ్లూరుపేట గోకులకృష్ణా ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాళంగి వరద ఉధృతికి పంట పొలాలు మునిగాయి. అలాగే పడమట కండ్రిగ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీటితో పాటు మునకలో ఉన్న పొలాలను ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో సుమారు 150 ఎకరాలకు పైగా పంటలు నీటమునిగాయని ఏఓ కవిత కలెక్టర్‌కు వివరించారు. కాళంగినది, పాములకాలువ రెండు రైల్వేట్రాక్‌లకు ముందు కలుస్తున్న నేపథ్యంలో వరదనీరు వెనక్కి ఒత్తిడి పెరగడం వల్ల పడమటకండ్రిగ రహదారిపై వరదనీరు ప్రవహిస్తోందని తెలిపారు. అలాగే వట్రపాళెం మునుగుతుందని తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈ మదనగోపాల్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ పాములకాలువ, కాళంగినది కలిసే వై పాయింట్‌ను పరిశీలించారు. సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం మండలం, సంతవేలూరు చెరువు కట్ట బలహీనంగా ఉండడంతో ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదారు రోజుల నుంచి సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని తడ, వరదయ్యపాళెం, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైందన్నారు. ఎక్కడైతే రోడ్లు, చెరువులు తెగిపోయాయో వాటిని గుర్తిస్తున్నామని, అలాగే నీట మునిగిన పంటన ష్టాన్ని కూడా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన వేయిస్తామన్నారు.

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఫెంగల్ తుపాను భయభ్రాంతులకు గురిచేస్తోంది. చిరు జల్లులతో పాటు.. కుండ పోత వానతో అన్నదాతకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. జిల్లాలో ప్రధానంగా ఈ రబీ సీజన్‌లో 2.2 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు వేశారు. అయితే ఇప్పటికే లక్ష ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. డిసెంబర్ చివరికల్లా మరో 1.2 లక్షల ఎకరాల్లో వరిపంట సాగులోకి రానుంది. ఈ క్రమంలో ఫెంగల్ తుపాను కారణంగా ముందస్తుగా సాగు చేసిన వరినాట్లకు తీరని నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పరిశీలిస్తూ..నష్టాన్ని అంచనా వేస్తూ..

జిల్లాలోని ఆయా విభాగాలకు చెందిన అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఓ వైపు వ్యవసాయశాఖ అధికారులు ఎంత మేరకు వరి పంటతోపాటు వేరుశనగ, మినుములు, పెసల పంటలు నీట మునిగాయో క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తున్నారు. అలాగే ఉద్యానశాఖ అధికారులు కూరగాయల పంటలతోపాటు పలు వ్యాపార, వాణిజ్య పంటల నష్టాన్ని లెక్కలు కడుతున్నారు. ఇంకో వైపు మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ, సెరికల్చర్ అధికారులు అదే బాట పట్టారు. ఇరిగేషన్ అధికారులు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులు తమకు వచ్చిన నష్టాన్ని ప్రభుత్వానికి తెలియజేయడానికి మండలాల వారీగా లెక్కలు కడుతున్నారు. మరో రెండు రోజుల్లో పూర్తి నివేదిక ప్రభుత్వానికి పంపనున్నారు.

కొట్టుకుపోయిన పెట్టుబడి

ఒక ఎకరం వరి పంటను సాగుచేయడానికి దాదాపు రూ.20 వేల వరకు ఖర్చుచేయాల్సి వస్తోంది. దున్నకాలు.. నాట్లు.. పురుగు మందులు.. ఎరువులు.. కోతల వరకు పెట్టుబడి పెట్టాల్సిందే. ప్రస్తుతం ఎరువుల ధరలు పెరగడంతో ఎకరానికి రూ.3 వేల నుంచి రూ.5వేలు వరకు ఖర్చుచేసినట్టు రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో వరి పంట సాగుచేయగా.. ఎరువుల కోసమే రూ.3 కోట్ల వరకు వెచ్చించారు. నాట్లు వేసిన రెండు మూడు రోజులకే వర్షాలు రావడంతో అంతా కొట్టుకుపోయిందని పలువురు ఆందోళన చెందుతున్నారు. పంట పెట్టుబడికి కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని ఇప్పటి వరకు పైసా కూడా చెల్లించలేదని విమర్శలు గుప్పిస్తున్నారు.



కోట: అల్లంపాడులో నీటమునిగిన వరి పైరును చూపుతున్న రైతులు

పూర్తిగా మునిగిపోయింది



నేను 20 రోజుల క్రితం మూడు ఎకరాల కౌలు భూమిలో వరి పంట సాగుచేశా. పంట పెట్టుబడి రూ.60వేలు అయ్యింది. వర్షాలతో నా పంట పూర్తిగా మునిగిపోయింది. నీళ్లెప్పుడు తగ్గుతాయో తెలియదు. వేసిన ఎరువులు కూడా కొట్టుకుపోయాయి. మళ్లీ ఎరువులు వేయడానికి నాకు శక్తి లేదు. ఏం చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం సాయం చేయాలని కోరుకుంటున్నా.

– లక్ష్మీపతి, రైతు సంతవేలూరు గ్రామం

నాలుగు ఎకరాల్లో మునక



నేను నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. పంట మొత్తం మునిగిపోయింది. మూడు రోజులుగా నీటిలోనే నాని పాచిపోతోంది. ఎరువుల కోసమే రూ.12 వేలకు పైగా ఖర్చుచేశా. నీటి ప్రవాహంతో ఆ మందంతా కొట్టుకుపోయింది. మళ్లీ పెట్టుబడి పెట్టాలంటే మళ్లీ అప్పులు చేయాల్సిందే. ప్రభుత్వమే ఆదుకోవాలి.–వెంకటేశ్వర్లు, సూళ్లూరు గ్రామం, రైతు

11వేల ఎకరాల్లో వరి మునక



జిల్లాలో ఇప్పటికే లక్ష ఎకరాల మేరకు వరి పంట సాగుచేశారు. డిసెంబర్ 31 వరకు వరి పంట సాగు చేస్తూనే ఉంటారు. తుపాన్ ప్రభావంతో 11వేల ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. మళ్లీ వర్షాలు లేకుంటే ఆ పంటకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నాం. వర్షాలు వస్తే నష్టాలు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే వేరుశనగ, మినుము, పెసర పంటలకు సంబంధించి నష్టాలపై విచారణ చేస్తున్నాం.

–ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



పెళ్లకూరులో చెరువును తలపిస్తున్న వరి పొలాలు



నారాయణవనం : నేలకొరిగిన అరటితోట

చలిగాలులకు మాజీ సర్పంచ్ మృతి




రంగయ్య(ఫైల్)

చిల్లకూరు: వర్షాలకు తోడు తీర ప్రాంత చలిగాలులకు తట్టుకోలేక లింగవరం గ్రామ మాజీ సర్పంచ్ ఇంగిలాల రంగయ్య(70) సోమవారం వేకువజామున మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



సూళ్లూరుపేట మండలంలో దెబ్బతిన్న వరి



పెళ్లకూరు మండలం, భీమవరం వద్ద నీటమునిగిన వరినాట్లు

గడువులోపు అర్జీలు పరిష్కరించాలి



సూళ్లూరుపేట: అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట: గడువు లోపు అన్ని శాఖల అధికారులు అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. కలెక్టర్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పట్ల కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇవ్వాలంటే రెండు మూడు గంటల సమయం పడుతుందన్నారు. దాంతో పాటు వ్యయ ప్రయాసల కోర్చి రావాల్సి ఉంటుందన్నారు. వారి ఇబ్బందిని గమనించి ప్రజల సౌకర్యార్థం ప్రజల వద్దకే అధికార యంత్రాంగమంతా కూడా వచ్చి అర్జీలు స్వీకరించి సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. రెండు వారాలకు ఒకసారి ఒక నియోజకవర్గాన్ని ఎంచుకుని ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మొత్తం 164 అర్జీలు దాకా వచ్చాయని తెలిపారు. ఇందులో రెవెన్యూ సమస్యలపై 104 అర్జీలు ఉన్నట్టు వెల్లడించారు. ఆర్డీఓ ఈతమాకులు కిరణ్మయియాదవ్, ఆరు మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

తిరుపతి అర్బన్: గడువులోపు అర్జీలన్నీ పరిష్కరించాలని జేసీ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ జిల్లా నలుమూలల నుంచి మొత్తం 82 అర్జీలు వచ్చినట్టు వెల్లడించారు. ఇందులో 53 అర్జీలు రెవెన్యూ సమస్యలకు చెందినవేనన్నారు. డీఆర్వో నరసింహులతోపాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

స్థానికులకు దర్శన టోకెన్ల జారీ



స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్లు అందిస్తున్న టీటీడీ చైర్మన్, అదనపు ఈఓ, ఎమ్మెల్యే

తిరుమల: గత నెలలో జరిగిన తొలి టీటీడీ బోర్డు సమావేశంలో తీర్మానం చేసిన మేరకు సోమవారం తిరుమలలోని బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులుతో కలిసి తిరుమల స్థానికులకు దర్శన టోకెన్ల జారీని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. స్థానికులకు కొన్ని టోకెన్లు జారీ చేసిన అనంతరం మీడియా ప్రతినిధులతో వారు మాట్లాడుతూ.. కొన్నేళ్ల తర్వాత స్థానికులకు దర్శనాన్ని పునరుద్ధరించేందుకు బోర్డు తన తొలి సమావేశంలో నిర్ణయం తీసుకుందని తెలిపారు. శ్రీవేంకటేశ్వరుని దర్శనం చేసుకునే అవకాశం కల్పించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. అనంతరం అడిషనల్ ఈవో మాట్లాడుతూ తిరుమల, తిరుపతి రూరల్, అర్బన్, రేణిగుంట, చంద్రగిరి స్థానికులకు దర్శన కోటా ఖరారు చేసేందుకు టీటీడీ అధికారులు కసరత్తు చేశారన్నారు. టెంపుల్ డెప్యూటీఈఓ లోకనాథం పాల్గొన్నారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, నిర్యాణం సమాచారం వర్ధంతి, జయంతిల నివాళులు ప్రకటనల కోసం సంప్రదించండి.

మీ ఉన్నతికై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సమాచారం తెలియజేసే అవకాశం.

సాక్షి దినపత్రికలో అంతిమయాత్ర, శ్రద్ధాంజలి, వర్ధంతి, జ్ఞాపకార్థకూడిక తదితర ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో వున్నారు.

SAKSHI

99122 20586, 9951602971

Mail id: tptadvtsakshi@gmail.com

క్లుప్తంగా

బంగారు గొలుసు అప్పగింత



బాధితులకు బంగారు గొలుసు అప్పగిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: పోగొట్టుకున్న బంగారు గొలుసును తిరిగి భక్తులకు అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు ముక్కంటి ఆలయ సిబ్బంది. శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి పట్టణానికి చెందిన శ్రీనివాసులు కుటుంబ సభ్యులు వచ్చారు. దర్శనం సమయంలో వారు బంగారు చైన్‌ను పోగొట్టుకున్నారు. అనంతరం ఆ బంగారు గొలుసును ఆలయ ఉద్యోగులు గుర్తించారు. బాధితులు తమ గొలుసు పోయినట్లు ఆలయ ఉద్యోగులకు విన్నవించారు. వారు సీసీ ఫుటేజీ ద్వారా నిర్ధారించి వారి బంగారు గొలుసు తిరిగి వారికి అప్పగించారు. దీంతో వారు ఆలయ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఉద్యోగులు ప్రవీణ్‌కుమార్, ఉమాపతి, ఎల్లారెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా నాగరాజు



వందవాసి నాగరాజు

సత్యవేడు: తిరుపతి జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. సోమవారం సత్యవేడులో జరిగిన సీపీఎం 14వ మహాసభ సందర్భంగా ఆయన్ను రెండో పర్యాయం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టీ.సుబ్రమణ్యం, దాసరి జనార్దన్. కమిటీ సభ్యులుగా భగత్ సాయిలక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బీ.రవి, ఆర్.లక్ష్మి, జోగి రవికుమాలు ఎన్నికయ్యారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నాయుడుపేట టౌన్: పట్టణంలోని గాంధీ పార్కు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 55 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి గత నాలుగు రోజులుగా గాంధీపార్కు సమీపంలో ఉంటుండేవాడన్నారు. ఆదివారం ఓ దుకాణం పక్కన నిద్రపోయాడు. చలికి తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి చూసేసరికే అతను మృతి చెందినట్లుగా సిబ్బంది నిర్ధారించారు. మృతుడు ఆకుపచ్చ, తెలుపు గళ్లు కలిగిన ఫుల్ హ్యాండ్ చొక్కా, బ్లూకలర్ జీన్స్ ఫ్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దస్త్రాల రాజ్యం.. అవినీతి భోజ్యం!

అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- ప్యానెల్‌లో లేని జూనియర్ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా తిష్ట
- ప్రభుత్వ పెద్దలకు భారీ ముడుపులిచ్చి పోస్టింగ్
- అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు
- రంగంలో దిగి అక్రమాల పుట్టను లోడుతున్న ఉన్నతాధికారులు



కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రేణిగుంట: రేణిగుంట సబ్‌రిస్ట్రార్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు కేర్ ఆఫ్ అడ్రెస్‌గా మారింది. అక్రమార్కుల భరతం పట్టే పనిలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. తిరుపతి నగరానికి చెందిన విలువైన భూములన్నీ సింహ భాగం రేణిగుంట సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలోనే ఉన్నాయి. దీంతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. కార్యాలంలో పనిచేసే సబ్ రిజిస్ట్రార్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు పోస్టింగ్‌కు ఎక్కువ డిమాండే ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు అవినీతి, అక్రమాలకు పాల్పడి సస్పెండ్‌కు గురయ్యారు. ఓ మహిళా సబ్ రిజిస్ట్రార్ అయితే ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిన నిధులను సైతం స్వాహా చేశారు. దీంతో ఆమెను సస్పెండ్ చేశారు.

జూనియర్ తిష్ట!

ఇక్కడ పనిచేసే ప్యానెల్‌లో లేని ఓ ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత బదిలీలు జరిగినా ఆ స్థానంలో రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌ను నియమించలేదు. ఆయన్నే కొనసాగించారు. రాష్ట్ర స్థాయిలో అధికార పార్టీ పెద్దల అండతో పాటు పెద్ద మొత్తంలో నియోజకవర్గంలోని కీలక నేతకు ముట్టజెప్పి సీటుని కదిల్చే సాహసం చేయనివ్వకుండా ఆయన తిష్ట వేసి కూర్చున్నారు. దీనికి తోడు కొత్తగా వచ్చిన ఓ అటెండర్ తోడుతో అక్రమార్జనకు గేట్లు ఎత్తి గల్లా పెట్టె తెరిచి ఉంచారు. ఇక్కడ ప్రభుత్వ భూమి అయినా, నిషేధిత జాబితాలోని భూమి అయినా చేయి తడిపితే రిజిస్ట్రేషన్లు చేసేస్తారు. తమ పరిధిలో లేని భూములను కూడా ఇక్కడ రిజిస్ట్రేషన్ చేస్తుండడంతో వివాదాస్పద భూములకు సంబంధించి కొందరు మీడియేటర్లు డాక్యుమెంట్ రైటర్లను కలసి రేటు మాట్లాడుకుంటున్నారు. ఇలాంటివి ఎన్నో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ తనిఖీలు చేసి అన్ని డాకుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. లభ్యమైన కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కూడా సోదాలు కొనసాగనున్నాయి. విచారణ నివేదికల ఆధారంగా కార్యాలయంలో పనిచేసే అవినీతి తిమింగలాలపై వేటు పడే అవకాశం ఉందని చర్చ జరిగితోంది.

అవినీతికి పాల్పడిన ఏ ఒక్కర్నీ వదలం

అవినీతికి పాల్పడిన ఏ ఒక్కర్నీ వదలమని రిజిస్ట్రేషన్ల శాఖ అడిషనల్ ఐజీ ఉదయభాస్కర్ రావు, డీఐజీ గిరిబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇక్కడ ప్రైవేట్ వ్యక్తుల ఆధిపత్యం ప్రదర్శిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు అందినట్టు వెల్లడించారు. ఈ మేరకు సిబ్బందిని బయటకు పంపి రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేశారు. ఇక్కడ ప్రయివేట్ సిబ్బంది ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. నిషేధిత 21ఏ జాబితాలోని భూములు అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్, ఒక అటెండర్ మీద పెద్ద స్థాయిలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు పదే పదే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. రేణిగుంటలోని కొందరు డాక్యుమెంట్ రైటర్లు, వెండర్లు రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారి నుంచి పెద్ద మొత్తంలో తీసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు. నిషేధిత భూముల్లో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు చేసిన డాక్యుమెంట్లు గుర్తించారు. ఈ మేరకు విచారణ నివేదికల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. రెండు రోజులు పాటు ఇక్కడే ఉండి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయునికి తప్పిన ప్రమాదం



వాగు నీటిలో నుంచి ఉపాధ్యాయుడు రత్నకుమార్‌ను రక్షిస్తున్న స్థానికులు

రేణిగుంట(ఏర్పేడు): స్కూల్‌కు బైక్ పై వెళుతూ ఉధ్రుతంగా ప్రవహిస్తున్న వాగు నీటిలో ఓ ఉపాధ్యాయుడు జారిపడ్డాడు. కొంత దూరం వరకు కొట్టుకుపోగా స్థానికులు గుర్తించి రక్షించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలు.. ఏర్పేడు మండలం, రాజులకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో రత్నకుమార్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై స్కూల్‌కి బయలుదేరాడు. పాపానాయుడుపేట –శ్రీకాళహస్తి మార్గం గోవిందవరం కాజ్‌వేపై వాగు దాటుతున్న క్రమంలో జారి నీటిలో బైక్‌తో సహా పడిపోయాడు. స్థానికులు వాగు నీటిలోకి దూకి తాళ్ల సాయంతో అతన్ని బైక్‌తో సహా ఒడ్డుకు చేర్చారు. ప్రాణాలను కాపాడిన స్థానిక యువకులకు ఉపాధ్యాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారికి సారె సమర్పణ



తిరుచానూరులో స్వాగతం పలుకుతున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి

- అశేష భక్తజనం మధ్య ఆధ్యాత్మిక పాదయాత్ర
- పద్మావతీ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి
- వందలాదిగా తరలివచ్చిన భక్తులు

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మావతీ అమ్మవారికి చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం పట్టువస్త్రాలు సమర్పించారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం వరకు ఆధ్యాత్మిక పాదయాత్రను నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక పాదయాత్ర వైభవంగా సాగింది. అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పాదయాత్రలో చెవిరెడ్డి వెంట నడిచారు. ప్రతి ఏటా అమ్మవారికి నిర్వహించే కార్తీక బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైన గజవాహన సేవకు, శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో గరుడ వాహన సేవకు చెవిరెడ్డి సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలను తీసుకుని పాదయాత్రగా అమ్మవారి ఆలయం వద్దకు వచ్చారు. తెల్లవారుజామున 5 గంటలకు తుమ్మలగుంట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన చెవిరెడ్డి సారె తీసుకుని తిరుచానూరుకు పాదయాత్రగా బయలు దేరారు. అనంతరం తిరుచానూరు ఆలయం వద్దకు చేరుకున్న చెవిరెడ్డి తన వెంట వచ్చిన భక్తులందరికీ ప్రత్యేక దర్శనం టిక్కెట్లను కొనుగోలు చేయించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆపై ఆలయాధికారులకు సారెను అందించారు. ఈ ఆధ్యాత్మిక పాద యాత్ర గాంధీపురం, అవిలాల, లింగేశ్వర నగర్, సాయినగర్, శ్రీనివాస పురం, పద్మావతీ పురం మీదుగా తిరుచానూరు వరకు సాగింది. పాదయాత్ర తిరుచానూరులోకి ప్రవేశించగానే సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ వేముల యశోద, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, భక్తులు అపూర్వ స్వాగతం పలికారు.

వేతన వెతలు

- మూడు నెలలుగా జీతాలు అందక కార్మికుల అవస్థలు
- గాంధీపురం పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన



గాంధీపురం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

తిరుపతి రూరల్: అధికార మత్తులో పచ్చ మంద రెచ్చిపోతున్నారు! పంచాయతీల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికుల పొట్టకొడుతున్నారు. ఇష్టానుసారంగా తమ వారిని నియమించుకుని, ఇష్టంలేని కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటున్న అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాల్సి ఉండగా, పంచాయతీ చోటా నేతల మెప్పు కోసం జీతాల బిల్లులు పెట్టకుండా వేధిస్తున్న వైనం తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో చోటుచేసుకుంది. నెలల తరబడి ఎదురు చూసినా జీతాలు పడకపోవడంతో కార్మికులు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగి.. 'మాకు జీతాలు ఇవ్వండి మహాప్రభో..' అంటూ నినదిస్తున్నా అధికారులు మాత్రం కనికరించకపోవడం గమనార్హం. కలెక్టర్ అయినా స్పందించి జీతాలు ఇప్పించాలని కార్మికులు వేడుకుంటున్నారు.

ఆ కార్మికులకు జీతాలు వద్దు....!

పంచాయతీలో పంపు ఆపరేటర్లు, బిల్లు కలెక్టర్లు, పారిశుధ్య కార్మికులు మొత్తం 25 మంది పనిచేస్తున్నారు. వారికి ప్రతినెలా 25వ తేదీన బిల్లు పెట్టి 1వ తేదీ నాటికి జీతాలు ఇస్తుంటారు. పంచాయతీ కార్యదర్శి బిల్లు పెడితే, సర్పంచ్ సంతకం చేస్తారు. అయితే గాంధీపురం పంచాయతీకి చెందిన కొందరు చోటా నేతలు పంచాయతీ అధికార విధుల్లో ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారు. ఎంఆర్‌పల్లి నుంచి అవిలాలకు వలస వచ్చి.. మఠం భూముల్లో కబ్జాలకు పాల్పడుతూ అక్రమ ×ధనార్జనకు పాల్పడుతున్న వ్యక్తి, ఇంటి పన్నుల్లో సైతం చిలక్కొట్టుడు కొట్టే నాయకులు పక్కన ఫోటోలు తీసుకుని అధికారులను బెదిరించే కొందరు కార్మికులకు జీతాలు ఇవ్వొద్దని పంచాయతీ కార్యదర్శికి హుకుం జారీచేశారు. దీంతో రెండు నెలల క్రితం బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి జీతాలు పెట్టకుండా ఉండిపోయారు. సర్పంచ్ లక్ష్మిశివ, వార్డు సభ్యులు సైతం కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే ఎలా.. అంటూ నిలదీశారు. ఆమె పనితీరుపై మండిపడ్డారు. జీతాలు పెట్టకపోతే పంచాయతీ నుంచి వెళ్లిపోవాలని మండిపడ్డారు.

అదనంగా ఏడుగురు విధుల్లోకి...

ఉన్న వాళ్లకు జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఇటీవల టీడీపీ నేతలు చెప్పారని పంచాయతీలో ఉద్యోగాల్లో చేరిన ఏడుగురికి మాత్రం జీతాలు ఇచ్చేందుకు బిల్లును సిద్ధం చేశారు. తమకు జీతాలు ఇవ్వకుండా కొత్తగా చేర్చుకున్న వారికి జీతాలు ఎలా ఇస్తారని కార్యదర్శిని నిలదీశారు. బాగా ఒత్తిళ్లు ఉన్నాయంటూ... ఆమె ఇచ్చిన సమాధానంపై సర్పంచ్ లక్ష్మిశివ, ఎంపీటీసీ సభ్యుడు జయకర్, వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేసిన అందరికీ జీతాలు ఇవ్వకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

“ జీతాలు ఇవ్వకుంటే ఎలా...



మూడో నెలలో కూడా ఇవ్వకపోతే ఎలా బతకాలి. ముఖ్యమంత్రి వస్తున్నారని రేయింబవళ్లు జాతీయ రహదారిని శుభ్రం చేశాం. కొందరికి జీతాలు పెట్టమని అధికారులు చెప్తున్నారు. మా పొట్ట కొట్టకండయ్యా. – వెంగమ్మ, పంచాయతీ కార్మికులు

ఈఎస్ఐ, పీఎఫ్ కూడా లేవు



పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా లేదు. ఇటీవల అనారోగ్యం బారిన పడితే ఈఎస్ఐ ఆస్పత్రికి వెళ్లినా వైద్యం చేయలేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి రూ.20 వేలు కట్టాల్సి వచ్చింది. జీతం రాక, ఆస్పత్రిలో బిల్లులు చెల్లించకలేక వడ్డీలకు అప్పు తెచ్చి మరీ కట్టాల్సి వచ్చింది. కలెక్టర్ గారు అయినా స్పందించాలి. – గణమ్మ, పంచాయతీ కార్మికులు

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

తిరుపతి సిటీ : లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పద్మావతి మహిళా వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డి.ఉమాదేవి తెలిపారు. మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం హ్యూమానిటీస్ బ్లాక్ సెమినార్ హాల్‌లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను అసభ్యకరంగా మాట్లాడడం, అసభ్యంగా ప్రవర్తించడం, సైగలు తదితర చేష్టల ద్వారా కొందరు లైంగిక వేధింపులకు పాల్పడుతుంటారని తెలిపారు. ఇలాంటి లైంగిక వేధింపులు కార్యాలయాలు, పాఠశాలలు తదితర ప్రదేశాల్లో ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. బాలికలు, మహిళలు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధ చట్టం –2013 ప్రధాన లక్షణాలు, శిక్షల అమలుపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎం.ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

– ఒకరి అరెస్ట్

నారాయణవనం: గంజాయిని విక్రయిస్తున్న తిరుపతికి చెందిన కడివి వెంకటేష్(47)ను అరెస్ట్ చేసి, అతని నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ.. మండలంలోని కీళగరం–వెత్తలతడుకు పాత రోడ్డులో సోమవారం మధ్యాహ్నం గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో, సిబ్బందితో గాలించామన్నారు. కీళగరం చెరువు కట్టపై అనుమానాస్పదంగా తిరుగుతున్న తిరుపతి టౌన్ క్లబ్ సమీపంలో నివాసముంటున్న గంగయ్య కుమారుడు వెంకటేష్‌ను అదుపులో తీసుకుని తహసీల్దార్ జయరామయ్య సమక్షంలో విచారంచామని చెప్పారు. వెంకటేష్ వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. గత ఏడాది తమిళనాడులోని కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో మత్తుపదార్థాల నిరోధక చట్టం కింద నమోదైన కేసులో వెంకటేష్ నిందితుడుగా ఉన్నాడని సీఐ రవీంద్ర తెలిపారు.


ద్వారకా నగర్ కాజ్‌వేపై వరద ఉధృతి



వరదనీటిలో మునిగిన కాజ్‌వే

నాగలాపురం: మండలంలోని ద్వారకా నగర్ కాజ్‌వేపై వరద ఉధృతి పెరిగింది. పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు నీటి మట్టం 29 అడుగులకు చేరడంతో అధికారులు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ద్వారకానగర్ కాజ్‌వేపై వరద ఉధృతి పెరిగింది. పిచ్చాటూరు మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.


బాడీబిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం




బంగారు పతకం సాధించిన జాగర్ల మూడి నవీన్

తిరుపతి రూరల్: 6వ అంతర్ జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీల్లో చంద్రగిరి మండలం, ముంగిలిపట్టు గ్రామానికి చెందిన జాగర్లమూడి నవీన్ బంగారు పతకం సాధించాడు. ఆదివారం తిరుపతిలో జరిగిన పోటీల్లో 75 కిలోల విభాగంలో నవీన్ తన శరీర సౌష్టవంతో అద్భుత ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. తిరుపతిలోని హెచ్‌కే ఫిట్‌నెస్ సెంటర్‌లో శిక్షణ పొందిన నవీన్‌ను జీమ్ కోచ్ హరికృష్ణ, తిరుపతి బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రకాష్, ప్రవీణ్, యూనస్‌బాషా, శివప్రసాద్ అభినందించారు.

అ'ద్వితీయం'



షేక్ సమద్



పోటీల్లో పాల్గొన్న సమద్

శ్రీకాళహస్తి: బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన షేక్ సమద్ ప్రతిభచాటి ద్వితీయ బహుమతి సాధించాడు. తిరుపతిలో సోమవారం జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల నుంచి పలువురు పోటీపడ్డారు. అందులో షేక్ సమద్ అత్యుత్తమ ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా పలువురు అతనిని అభినందించారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు



ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించే విధానంపై అవగాహన కల్పిస్తున్న డీఈ

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ బిల్లుల చెల్లింపులను మరింత సులభతరం చేయడంలో భాగంగా విద్యుత్ బిల్ చివరన క్యూ ఆర్ కోడ్‌ని ప్రవేశపెట్టిందని, కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో బిల్లులను చెల్లించవచ్చని తిరుపతి సబ్ డివిజన్–1 డీఈ ఆంజనేయులు తెలిపారు. సోమవారం తిరుపతిలో క్యూర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే విధానంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు.

ఎస్వీయూలో అన్యమత ప్రచారం!



ప్రొఫెసర్‌ను చొక్కాపట్టి లాగుతున్న భజరంగ్‌దళ్ కార్యకర్తలు

తిరుపతి సిటీ: తిరుపతి ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగపు ప్రొఫెసర్ చెంగయ్య అన్యమత ప్రచారం చేస్తున్నారన్న సమాచారం వర్సిటీలో కలకలం రేపింది. విషయం తెలుసుకున్న స్థానిక భజరంగ్‌దళ్ కార్యకర్తలు కళాశాలలోని ఆయన ఛాంబర్‌లోకి వెళ్లి విచారించగా ఓ మతానికి చెందిన పుస్తకాలు ఆయన కార్యాలయంలో తారసపడ్డాయి. దీంతో ఆగ్రహించిన భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆయనను తన ఛాంబర్ నుంచి కాలర్ పట్టుకుని ఈడ్చుకుంటూ బయటకు నెట్టారు. కళాశాల ఆవరణలో పార్కింగ్ చేసిన ఆయన కారుపై దాడిచేసి అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. ప్రస్తుతం వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపకుడు చెంగయ్యపై విచారణ కొనసాగుతోంది.

అన్యమత ప్రచారంపై విచారణ

ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ చెంగయ్య వర్సిటీలో అన్యమత ప్రచారం చేసినట్లు సమాచారం తమ దృష్టికి వచ్చిందని, ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఇప్పటికే విచారణ నిమిత్తం కమిటీని నియమించామని, నివేదిక ప్రకారం వర్సిటీ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ చెంగయ్య మాట్లాడుతూ తాను ఎటువంటి అన్యమత ప్రచారం చేయలేదన్నారు. కొందరు కావాలనే తనపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు.

పోటాపోటీగా అంతర్ కళాశాలల టీచింగ్ స్టాఫ్ టోర్నమెంట్



అధ్యాపకులకు ట్రోఫీని అందజేస్తున్న రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్ అంతర్ కళాశాలల టోర్నమెంట్ సోమవారం వర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో పోటాపోటీగా జరిగింది. ఇందులో చెస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్‌లో పురుషులు, మహిళల విభాగాల్లోని పోటీలకు పలు కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన అధ్యాపకులకు వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీవీ మురళీధర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన అందించాలి



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులతో వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే ప్రధాన పాత్ర అని వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఎడ్యుకేషనల్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. ఎగ్జిబిషన్‌లో బీఈడీ విద్యార్థులు ప్రదర్శించిన పలు పాఠ్యాంశాలకు సంబంధించిన ఆకృతులు ఆకట్టుకున్నాయన్నారు. రిజిస్ట్రార్ రమాశ్రీ, అధ్యాపకులు కాదాంబిని, వెంకటరావు, దక్షిణమూర్తి శర్మ, మురళీధరరావు, కనపాల కుమార్, సునీత, వైష్ణవి, చారుకేష్, లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ 10th, ఇంటర్ గత 4 వం॥ల నుండి BOSSEJUA బోర్డుల (AP బోర్డు గుర్తింపు/సమానం) ద్వారా ఎందరో ఉత్తీర్ణులై వివిధ కాలేజీల్లో లేదా ప్రమోషన్లు పొందిన, 10th, ఇంటర్ పరీక్షలు March-2025కు అడ్మిషన్లు జరుగుచున్నవి. 99851 92105

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA, Regular/lateral entry.9381287629

Real Estate

PLOTS FOR SALE

■ నేషనల్ హైవేకి అనుకొని తిరుపతి IIT కి ఎదురుగా మరియు విమానాశ్రయం దగ్గర ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు అన్ని వసతులతో డైరెక్ట్ ఓనర్.9502774175, 7416211984.

Wanted

■ తిరుపతిలోని ప్రముఖ స్కూల్/కాలేజ్ నందు పనిచేయుటకు Receptionist, Accountant, Primary Maths Teacher కావలెను. Good Salary. 6303316571.

■ తిరుపతి, పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు ఫీల్డ్ ఆఫీసర్ కావలెను. సంప్రదించండి సెల్: 93467 52691, 80199 56289.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోమ్ అవకాశం కలదు. 8121818692

■ మా కంపెనీ మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయుటకు, కాల్స్ మాట్లాడుటకు యువతీ/యువకులు కావలెను. డేటా ఎంట్రీ, టీమ్ లీడర్స్. అర్హత :10th, ఇంటర్, జీతం: 20K పైన. 7995494707.

■ Wanted Male Marketing Staff Qualification Any Inter/Degree. Age Limit: 21 to 45 years. Salary: 10 to 20,000/- Location: Tirupathi. Cont: 9248733375, 8008577927

■ కష్టపడేవ్వే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు.ఫ్రీ రూం+భోజనం.HYD. 7995885899

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9019041491

■ Wanted Security Guards to work at Kuppam, Andhra Pradesh. 12hrs 15,000/-P.M.Age:25-45Yrs. Rudhraksh Security Force. Ph : 7702365554

గమనిక

వాటుగలిగిన ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970